సాక్షి
గుంటూరు
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



తాగునీటి చెరువుకు గండి

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గల తాగునీటి చెరువుకి బుధవారం గండిపడింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గండిని పూడ్చేందుకు పనులు ప్రారంభించారు.



ద్వారబంధ పూజలు

సత్తెనపల్లి: సత్తెనపల్లి సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బుధవారం ఆశ్రమ ముఖ ద్వారం ,విశ్వేశ్వరస్వామి ఆలయానికి, నూతన ద్వారబంధ పూజలు నిర్వ హించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 506.10 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

నేడు ఏపీఆర్జేసీడీసీ సెట్, ఏపీఆర్ఎస్ క్యాట్

జిల్లాలో హాజరు కానున్న 2,312 మంది విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికై గురువారం ఏపీఆర్జేసీ డీసీసెట్-2024, ఏపీఆర్ఎస్ క్యాట్-2024 పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం గుంటూరు నగర పరిధిలో 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు కేంద్రాల్లో జరగనున్న ఏపీఆర్ఎస్ క్యాట్-2024కు 385 మంది దరఖాస్తు చేశారు. అదేవిధంగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికై గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఎనిమిది కేంద్రాల్లో జరగనున్న ఏపీఆర్జేసీ డీసీ సెట్-2024కు 1,927 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా సమన్వయకర్త సీహెచ్ శిరీష తెలిపారు.

యార్డులో 72,153 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 69,174 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 72,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 48,590 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వై శ్రీనివాసరావు

గురజాల: సీనియర్ సివిల్ జడ్జిగా వై శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నరసాపురం కోర్టు నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా గురజాల కోర్టుకు వచ్చారు. ఇప్పటి వరకు గురజాల సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వర్తిస్తున్న బీఎల్‌వీ శేషాద్రి కర్నూలు జిల్లా కోర్టులోని లీగల్ సెల్ అథారిటి కార్యదర్శిగా బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వై శ్రీనివాసరావును న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ఏర్పాటుకు పూజలు



క్రోసూరు: స్థానిక చెరువు కట్ట వద్ద క్రోసూరు గ్రామ అభయాంజనేయస్వామి కమిటీ ఆధ్వర్యంలో 32 అడుగుల అభయాంజనేస్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం పూజలు చేశారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కార్యక్రమంలో పాల్గొని విగ్రహ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అభయాంజనేయస్వామి కమిటీ సభ్యులు సిద్దు కామేశ్వరాచారి, కర్నాటికృష్ణారావు, కంభంపాటి కొండలు, జి.గురున్నాథం, బాలకృష్ణ, ఆంజనేయరెడ్డి, ఆముదాల వెంకట్రావు, కె.రామాంజనేయులు, మాగుంట నాగరాజు, మార్కారపు నాగేశ్వరరావు, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, అనుముల కోటిరెడ్డి, అనుముల శ్రీనివాసరెడ్డి, రవీంద్రబాబు, వెలది అప్పారావు, కాల్వపల్లి శ్రీనివాసరెడ్డి, మేదర రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వం







సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల దాఖలు అనంతరం అభ్యర్థులు తమ ప్రచారం ముమ్మరం చేశారు. వైఎస్సార్ సీపీ గుంటూరు పశ్చిమ అభ్యర్థి విడదల రజిని 29వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. స్థానిక మసీదు బయట మతపెద్దలను కలిసి దువా చేశారు. వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య పట్టణ పరిధిలోని 26వ వార్డులో ప్రచారం నిర్వహించారు. నేతన్నలను కలిసి ఓటు అభ్యర్థించారు. అదేవిధంగా గుంటూరు తూర్పు అభ్యర్థి నూరి ఫాతిమా నియోజకవర్గంలోని 8వ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. - పట్నం బజారు/ మంగళగిరి



ప్రత్తిపాడులో బలసాని నామినేషన్‌కు పోటెత్తిన జనసంద్రంతో కిక్కిరిసిన గుంటూరు-పర్చూరు పాత మద్రాసు రోడ్డు

ఉప్పొంగిన జనకెరటం

- ప్రత్తిపాడు చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో అభిమాన సంద్రం
- 25 వేల మందికి పైగా తరలివచ్చిన ప్రజలు
- అశేష జనవాహిని మధ్య అట్టహాసంగా బలసాని కిరణ్‌కుమార్ నామినేషన్

ప్రత్తిపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ బుధవారం అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులు వేలాదిగా తరలివచ్చారు. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు జిల్లా కేంద్రం గుంటూరులోని తన కార్యాలయం నుంచి ర్యాలీగా బయలు దేరిన బలసానికి అడుగడుగునా విశేష ప్రజాదరణ లభించింది. ఏటుకూరు, పుల్లడిగుంట, ఐదవ మైలు, కుర్నూతల అడ్డరోడ్డు, కోయవారిపాలెం, బొర్రావారి పాలెం, తిక్కిరెడ్డిపాలెం గ్రామాల మీదుగా ప్రత్తిపాడుకు చేరుకున్నారు. అశేష జనసందోహం నడుమ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఆర్‌ఓ పి.శ్రీకర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. గుంటూరు నుంచి ప్రత్తిపాడు వరకు పోటెత్తిన ప్రజలతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. భారీ ర్యాలీతో ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి కిరణ్‌కుమార్ చేరుకున్నారు. నామినేషన్ పర్వానికి సుమారు పాతిక వేల కుపైగా జనం తరలిరావడం నియోజకవర్గ చరిత్రలో ఇదే తొలిసారి అని పలువురు రాజకీయ మేధావులు, సీనియర్ నాయకులు విశ్లేషిస్తున్నారు.



బలసానిని కలిసి అభినందనలు తెలుపుతున్న ఎంపీ అయోధ్య రామిరెడ్డి

గుంటూరు నుంచి ఆరున్నర గంటలు..

నామినేషన్ వేసేందుకు గుంటూరు నుంచి ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయానికి (పద్దెనిమిది కిలోమీటర్లు) రావడానికి బలసానికి సుమారు ఆరు గంటల సమయం పట్టింది. ఉదయం తొమ్మిది గంటలకు తన కార్యాలయం నుంచి ప్రారంభమైన కిరణ్‌కుమార్‌కు గ్రామగ్రామాన ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రత్తిపాడు రామవాగు నుంచి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకునేందుకే సుమారు రెండు గంటలు పట్టిందంటే ప్రజాస్పందన ఎంతపెద్ద ఎత్తున ఉందో అర్థమవుతోంది.

అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు..

నామినేషన్ కార్యాక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి తరలి



ప్రత్తిపాడు ఆర్‌ఓ పి. శ్రీకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులకు అలాగే తనపై విశ్వాసాన్ని చూపుతున్న ఓటరు మహాశయులకు, పెద్ద ఎత్తున తరలివచ్చిన మహిళలు, వృద్ధులకు బలసాని కిరణ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్లు, ఆయా విభాగాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు బలసాని ప్రత్యేకంగా పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గుంటూరు కృష్ణా జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్లు మర్రి రాజశేఖర్, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు విభాగాల డైరెక్టర్లు పాల్గొన్నారు.



ర్యాలీలో అభివాదం చేస్తున్న బలసాని కిరణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు

నామినేషన్ సైడ్ లైట్స్..

- గుంటూరు నగరంలోని కొరిటెపాడు రామాలయం, ఆంజనేయస్వామి దేవస్థానాల్లో కిరణ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.
- గుంటూరు లాడ్జి సెంటరులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఏటుకూరు బైపాస్‌లో ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రావెల కిషోర్‌బాబులకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు.
- పుల్లడిగుంటలో ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పర్వీన్‌సుల్తానా నూరుల్లా ఆధ్వర్యంలో జేసీబీలతో ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని, ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్యలకు భారీ గజమాలలు వేసి స్వాగతించారు.
- సుమారు నాలుగు వేల ద్విచక్రవాహనాలతో యువత, భారీ ర్యాలీ చేశారు.
- తీన్‌మార్‌లు, కనక తప్పెట్లు, డీజేల మోతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- రైతులు ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించి సత్తా చాటారు.

పోటెత్తిన ఆంధ్రాప్యారిస్

- వేలాదిమందితో సాగిన అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్ ర్యాలీ
- గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య సహా ఎడ్లబండిపై తరలిన వైనం
- రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ ఎదుట నామినేషన్ దాఖలు



తెనాలి ఆర్‌ఓ, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నామినేషను సందర్భంగా ఆంధ్రాప్యారిస్ తెనాలి అభిమాన సంద్రమైంది. కేవలం కిలోమీటరు కూడా లేని నామినేషను యాత్రలో వేలాదిమంది కదం తొక్కారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నామినేషను దాఖలుకు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉదయం 9.30 గంటలకు స్థానిక బోసు రోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, అలంకరించిన ఎడ్లబండిపై గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అక్కడకు చేరుకున్న వేలాదిమంది జనం వెన్నంటి నడిచారు. ర్యాలీకి ముందు శివకుమార్ కటౌట్‌తో మహిళల విన్యాసాలు, కేరళ సంప్రదాయ డమ్ము వాద్యంతో కళాకారిణులు, వైఎస్సార్ సీపీ రంగుల చీరెలను చిందుకు అనువుగా ధరించిన మహిళా డప్పు వాద్యకారులు, తీన్‌మార్ వాద్యబృందం, చెంచు కళాకారులు విన్యాసాలు అందరినీ ఆకర్షించాయి. పలువురు యువకులు బైక్ ర్యాలీతో సందడి చేశారు. మార్గమధ్యంలో డైమండ్ టీ సెంటర్ వద్ద శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. క్రేన్ సహాయంలో భారీ కటౌట్లు వేలాడదీశారు. పార్టీ జెండా రంగు కాగితాలు, గజమాలలతో అభిమానులు పార్టీ అభ్యర్థులకు స్వాగతం పలికారు.



ప్రత్యేక వాహనంలో మహిళా నేతలు

- ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, దేసు శ్రీనివాసరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, చీఫ్ ఎన్నికల ఏజెంట్ ఎస్‌బీ శివతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్‌కు నామినేషను పత్రాలను దాఖలు చేశారు. అనంతరం బయటకు వచ్చిన శివకుమార్‌కు బార్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ నాయకత్వంలో పలువురు న్యాయవాదులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ ర్యాలీలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్, శివకుమార్ సతీమణి పుష్ప, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కొల్లిపర ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కొల్లిపర మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు కావేటి నిర్మల, మన్నవ ప్రభాకర్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



తెనాలిలో అన్నాబత్తుని శివకుమార్ నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన జనసందోహం ర్యాలీ



ర్యాలీలో ఎమ్మెల్యే మద్దాళి గిరి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రోశయ్య, శివకుమార్‌లు

నాదెండ్ల మనోహర్ డీఎన్ఏనే వెన్నుపోటు

- నామినేషన్ అనంతరం మీడియాతో శివకుమార్

తెనాలి: నియోజకవర్గంలో ప్రస్తుతం విశ్వసనీయతకు, వెన్నుపోటుకు మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఎన్నికల నామినేషన్ దాఖలు అనంతరం మీడియాతో మాట్లాడారు. వెన్నుపోటు అనేదాన్ని తెలుగు ప్రజలకు పరిచయం చేసింది నాదెండ్ల భాస్కరరావు అన్నారు. ఎన్టీ రామారావుకు భాస్కరరావు వెన్నుపోటు పొడిచారని గుర్తుచేశారు. ఆయన కొడుకు నాదెండ్ల మనోహర్, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో స్పీకర్‌గా చేసి, తర్వాత జనసేనలో చేరి, ఆ పార్టీని టీడీపీకి అమ్మేసి భాస్కరరావుకు వారసుడనని నిరూపించుకున్నారన్నారు. అదే ఎన్టీఆర్ క్యాబినెట్‌లో తన తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ మంత్రిగా విశ్వసనీయతతో వ్యవహరించారని చెబుతూ, ఆయన తనయుడుగా తాను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విశ్వసపాత్రుడిగా ప్రజాసేవలో ఉన్నానన్నారు. మనోహర్ డీఎన్ఏ వెన్నుపోటు...ఆరోజు ఆయన తండ్రి ఎన్టీఆర్‌కు, ఈరోజు మనోహర్ పవన్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఇది నిజమా...కాదా? అనేది ప్రజలు ఆలోచించాలని కోరారు. ఎమ్మెల్యేగా అయిదేళ్ల ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని చేసే భాగ్యం కల్పించినందుకు, తెనాలి నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా మూడోసారి పోటీచేసే అవకాశం, అదృష్టం కల్పించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని శివకుమార్ అన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారనేది ఆలోచించి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యకు, తెనాలి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు ఓటుచేసి వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

ఇదీ 'లెక్క'!

- ఖర్చు పెరిగితే తిప్పలే
- ఎమ్మెల్యే అభ్యర్థులు రూ.40 లక్షలు.. ఎంపీ అభ్యర్థులు రూ.90 లక్షలు మించి ఖర్చు చేయకూడదు

కొరిటెపాడు(గుంటూరు): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల హడావుడి మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు. అభ్యర్థులు ఎన్నికల్లో రోజువారీ చేసే ఖర్చులకు లెక్క పక్కాగా నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అభ్యర్థులు ప్రతి రోజు చేసిన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘానికి అందించాల్సి ఉంటుంది. ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40 లక్షలు, పార్లమెంట్ అభ్యర్థి రూ.90 లక్షలకు మించి ఖర్చు చేయరాదని స్పష్టం చేశారు. ఒకవేళ ఎక్కువ ఖర్చు చేస్తే ఎన్నికల సంఘం వేటు వేసే అవకాశం ఉంది. దీంతో ఎన్నికల్లో చేసే రోజువారీ ఖర్చులకు సంబంధించిన వివరాలపై ఎన్నికల పరిశీలకులు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఏప్రిల్ 18వ తేదీ నుంచి ఎన్నికల నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి ఎన్నికల ముగింపు వరకు ఎన్నికల కోసం ఖర్చు చేసే వివరాలను రోజు వారీగా లెక్క చెప్పాల్సి ఉంటుంది. పట్టణం, గ్రామాల వారీగా ఎన్నికల ప్రచారం కోసం అవసరమైన ఖర్చుల వివరాలను ఎన్నికల సంఘం ముందుగానే విడుదల చేసింది.

దౌర్జన్యం.. ఇష్టానుసారం

- టీడీపీ యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు
- పొన్నూరు ఆర్‌ఓ కార్యాలయంలోకి దూసుకుపోయిన టీడీపీ, కూటమి కార్యకర్తలు
- పోలీసులతో వాగ్వాదం.. మమ్మల్ని ఏం చేయలేరంటూ బీరాలు
- ఎలక్షన్ కమిషన్, పోలీసులకు ఫిర్యాదు చేసిన నోడల్ అధికారి

పొన్నూరు: దౌర్జన్య వైఖరితో టీడీపీ నేతలు యథేచ్ఛగా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తున్నారు. అడ్డుకున్న ఎన్నికల అధికారులు, పోలీసులపై వాగ్వాదానికి దిగడమే కాకుండా, తిరగబడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం టీడీపీ పొన్నూరు అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ నామినేషన్ సందర్భంగా టీడీపీ, దాని మిత్రపక్ష నేతలు కోడ్ నిబంధనలను తుంగలో తొక్కారు. కోడ్‌ను పూర్తిగా ఉల్లంఘించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆర్‌ఓ కార్యాలయంలోకి దూసుకుపోయారు. అడ్డొచ్చిన పోలీసులపై దురుసుగా ప్రవర్తించారు. పోలీసుల విధులను అడ్డుకుని ఆర్‌ఓ కార్యాలయం వద్ద రాద్ధాంతం చేశారు. ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా బారికేడ్లు తొలగిస్తూ ఆర్‌ఓ కార్యాలయంలోకి గోడలు దూకుతూ ఇష్టానుసారంగా వ్యవహరించారు. వీరి చర్యలకు అడ్డుచెబుతున్న ఎన్నికల అధికారులపైనే బెదిరింపులకు దిగారు. పోలీసులతో సైతం వాదనలు చేశారు. ఆర్‌ఓ కార్యాలయ ఆవరణలోనే టీడీపీ కూటమి నేతలు విలేకరులతో సమావేశం నిర్వహించారు. పోలీసులు లాఠీచార్జ్ చేయడంతో కార్యకర్తలు చెల్లాచెదురయ్యారు. ఘటనపై ఎన్నికల నోడల్ అధికారి నయీం అహ్మద్ ఎన్నికల కమిషన్, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యాలయంలోకి దౌర్జన్యంగా వస్తున్న వీడియోలను కమిషన్‌కు సమర్పించినట్లు తెలిపారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న ధూళిపాళ్ల నరేంద్ర



ఆర్వో కార్యాలయం గోడదూకుతున్న వైనం

క్లుప్తంగా

26 నుంచి కేఎల్‌యూ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ పార్థసారథి వర్మ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం ఈ నెల 26వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థసారథి వర్మ తెలిపారు. నగరంలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యా లయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వడ్డేశ్వరంలోని యూనివర్సిటీ సి-బ్లాక్ లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో ర్యాంకులు పొందిన విద్యార్థులతోపాటు ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు పొందిన విద్యార్థులు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనవచ్చని చెప్పారు. కేఎల్ ట్రిపుల్‌ఈ ఎంట్రన్స్ పరీక్షలో లక్షమంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. ఉపకార వేతనాలు పొందుకోవాలనుకునే విద్యార్థులు ఈనెల 26 నుంచి 30వతేదీ వరకు జరుగుతున్న కౌన్సెలింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.యూనివర్సిటీ కౌన్సెలింగ్ కన్వీనర్ డాక్టర్ సుమన్ మాట్లాడుతూ కౌన్సెలింగ్ కు వచ్చే విద్యార్థులు సంబంధిత డాకుమెంట్స్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీని వాసరావు, అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

రెంటాల (రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు సమస్యలపై అవగాహన ఉంది

- ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరమే
- నామినేషన్ అనంతరం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్

ప్రత్తిపాడు: నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉందని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం బలసాని కిరణ్ ఆర్వో కార్యాలయంలోని మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవశ్యకత చాలా ఉందని బలసాని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు గుంటూరు జీజీహెచ్‌కు పరుగులు పెట్టాల్సి వస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌తో చర్చించి ప్రత్తిపాడులో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గ ప్రజలు తాగునీరు, సాగునీటి సమస్యను తీవ్రంగా ఎదుర్కొంటున్నారని కిరణ్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే అయిన తరువాత పై రెండు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గుంటూరు చానల్ పొడిగింపు, అప్పాపురం కాలువ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజా స్పందన చూసిన తరువాత ముప్పై వేలకు పైగా మెజార్టీ వస్తుందని సుస్పష్టమైందని కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు.

సొసైటీల కంప్యూటీకరణపై అధ్యయన బృందం పర్యటన



అధికారులతో అధ్యయన బృందం సభ్యులు కే.టి. వేణుమాధవ్, విజయ చంద్రారెడ్డి

నరసరావుపేట: జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సంఘాల్లో నిర్వహిస్తున్న కంప్యూటీకరణపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ శిక్షణా కేంద్రం ఫ్యాకల్టీ బృందం బుధవారం అధ్యయనం చేసింది. కంప్యూటీకరణలో ఎదురవుతున్న సమస్యలు, తదితర అంశాలపై వారు సంఘాల ఉద్యోగులకు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట బ్రాంచ్ పరిధిలోని యడ్లపాడు, నరసరావుపేట పరిధిలోని అన్నవరం, ఇక్కుర్రు, లింగంగుంట్ల, అమరావతి బ్రాంచ్ పరిధిలోని నరుకులపాడు, పెదమద్దూరు, మునుగోడు సొసైటీలను ఈ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా డీజీఎం కె. విజయచంద్రారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కంప్యూటీకరణ కార్యక్రమాన్ని ఆప్కాబ్ ఎండీ ఆదేశాల మేరకు సందర్శించినట్లు తెలిపారు. సొసైటీల్లో కంప్యూటీకరణకు అవసరమైన మ్యాన్ పవర్, టెక్నాలజీని అందచేసేందుకు అధ్యయనం చేస్తున్నారు. రాష్ట్రంలో కంప్యూటీకరణ చేసేందుకు 51 సొసైటీలను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశామన్నారు. గుంటూరు జిల్లాలో మంగళగిరి సొసైటీని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపికైన సొసైటీలతో పాటు మిగిలిన సొసైటీలు కూడా ఏకకాలంలో కంప్యూటరీకరణ పూర్తయ్యేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఆయా బ్రాంచ్ పరిధిలోని సొసైటీల సిబ్బంది, సీఈవోలు, బ్యాంక్ డిపార్ట్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రిటైర్డ్ జీఎం కే.టి వేణుమాధవ్, జీడీసీసీ బ్యాంక్ జనరల్ మేనేజర్ చింతల అజయ్‌కిషోర్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి పి. నారాయణ స్వామి, జీడీసీసీ బ్యాంక్ ఏజీఎంలు బి. సుబ్బారావు, బాబురావు, బత్తుల బాలకృష్ణారెడ్డి, టి. శ్రీనివాస్, చీఫ్ మేనేజర్లు ఎస్. రమాదేవి, ఆర్. సుధీర్, మేనేజర్లు జి. శ్రీనివాస్, ఏఎంలు అనిల్, ఎన్.వెంకటేశ్వర్లు, సంఘ సీవోలు వెంకటరెడ్డి, రామాంజనేయులు, కంటు శ్రీనివాసరావు, టి. రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా షేక్ ఖలీల్

నరసరావుపేట : ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిలకలూరిపేటకు చెందిన షేక్ ఖలీల్‌ను జిల్లా మైనార్టీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

నాక్ బృందం ఏఎన్‌యూ సందర్శన

- కమిటీకి యూనివర్సిటీ నివేదిక సమర్పించిన వీసీ రాజశేఖర్



అధ్యాపకులతో మాట్లాడుతున్న నాక్ బృందం సభ్యులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నాక్(నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్) సందర్శన బుధవారం ప్రారంభమయ్యింది. నాక్ బృందం సభ్యులకు యూనివర్సిటీ పరిపాలనా భవన్‌లో ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం యూనివర్సిటీ సమగ్రాభివృద్ధిపై వీసీ ఆచార్య పి.రాజశేఖర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా కమిటీకి నివేదిక సమర్పించారు.

ఏఎన్‌యూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు సాధిస్తోందని దీనికి ముఖ్య కారణం బోధన, పరిశోధన, క్రీడా రంగాల్లో వినూత్న మార్పులు వచ్చేలా సమాజానికి ఉపయోగపడే కోర్సులను ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు కోర్సులు పూర్తి చేసిన వెంటనే ఉపాధి లభించేలా వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని కమిటీ దృష్టికి తీసుకొచ్చారు. విద్యార్థులకు ఏ విశ్వవిద్యాలయంలో లేని విధంగా కంగన్ వాటర్ అందిస్తున్నామన్నారు. వీసీ నివేదికపై నాక్ కమిటీ సభ్యులు వ్యక్తం చేసిన సందేహాలను వీసీ నివృత్తి చేశారు. ఐక్యూఏసీ విభాగం నివేదికను కోఆర్డినేటర్ ఆచార్య సంధ్య కోల్ సమర్పించారు. తరువాత నాక్ బృందం సభ్యులు కమిటీ మూడు బృందాలుగా ఏర్పడి వివిధ కార్యాలయాలు, విభాగాలు సందర్శించారు. విభాగాల తనిఖీల్లో భాగంగా నాక్ బృందం సభ్యులు పలు విభాగాల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు కోర్సులు ఎంచుకోటానికి కారణం, భవిష్యత్ ప్రణాళిక, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎంపిక పట్ల మీ అభిప్రాయం, ఇక్కడ అందిస్తున్న బెస్ట్ ప్రాక్టీస్, సౌకర్యాలు, లేబరేటరీలు, విభాగాల పనితీరు, అధ్యాపకులు, అర్హతలు వంటి విషయాలను విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. నాక్ బృందం చైర్మన్ ప్రొఫెసర్ రాజేష్ సింగ్, అనిల్ కుమార్ మహపాత్రలు సైన్స్ విభాగంలోని బయోటెక్నాలజీ, బయో కెమిస్ట్రీ, బోటనీ, మైక్రోబయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషనల్ సైన్సెస్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, జియాలజీ, న్యాయ శాస్త్ర విభాగం, బుద్ధిజం విభాగం, ఎకనామిక్స్, కామర్స్ మేనేజ్మెంట్, ఎడ్యుకేషన్, సోషియాలజీ,సోషల్ వర్క్, హిస్టరీ అండ్ ఆర్కియాలజీ, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగాలను సందర్శించి పలు అంశాలు తనిఖీ చేసింది. ప్రొఫెసర్ సచిన్ దేశముఖ్, సంజయ్ జైన్ బృందం ఫార్మసీ కళాశాల, యానిమల్ హౌస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, క్రీడా ప్రాంగణం , ఇండోర్ స్టేడియం లను పరిశీలించారు. ప్రొఫెసర్ డేవిడ్ పీటర్, రాజగోపాల్ శరవణన్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ కళాశాల సందర్శించి అక్కడ విభాగాలతో పాటు ఇంకుబేసిన్ సెంటర్లను పరిశీలించారు. కమిటీ సందర్శన ఈనెల 26వ తేదీ వరకు కొనసాగుతుంది.

గుంటూరు పార్లమెంట్‌కు మరో 10 మంది నామినేషన్లు

గుంటూరు వెస్ట్: గుంటూరు పార్లమెంట్ స్థానానికి మరో పది మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డికి నామినేషన్లు అందజేశారు. వీరిలో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు కాగా మిగిలిన వారు వివిధ రాజకీయ పార్టీలకు చెందిన వారు. వారిలో కన్నెబోయిన వంశీకృష్ణ, పిల్లి బాబూరావు, దొప్పలపూడి వీరదాస్, వెంకట శివ రామాంజనేయులు వంకాయలపాటి వీరంతా స్వతంత్ర అభ్యర్థులు. తెనాలి ప్రకాష్ (బహుజన్ సమాజ్ పార్టీ), సముద్రాల చిన కోటయ్య (జై భీమ్‌రావ్ భారత్ పార్టీ), శివారెడ్డి యెంద్రారెడ్డి (నవతరమ్ పార్టీ), నూనే పవన్ తేజ నాయుడు (కాంగ్రెస్ పార్టీ), ఉమర్ బాషా షేక్ (జన సహాయక పార్టీ), పెమ్మసాని చంద్రశేఖర్ (టీడీపీ). ఉన్నారు.

వైభవోపేతం..ఆలయ పునః ప్రతిష్టోత్సవం

- సోమేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ట
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మోపిదేవి



పొన్నపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి నాయకులు



నూతన ఆలయం వద్ద భారీ క్రేన్ సాయంతో ధ్వజస్తంభ ప్రతిష్ఠా

చెరుకుపల్లి: ఆలయాల్లో నిత్యపూజల్లో తరించటం ద్వారా మానసిక ప్రశాంతతోపాటు పాడి పంటలు వర్ధిల్లుతాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పొన్నపల్లి అగ్రహారంలో వెలసిన శ్రీ సత్య ప్రసానాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవానికి ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ముందుగా వేద పండితులు ఎంపీ మోపిదేవి ని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఆ ఆలయాన్ని రూ 50లక్షల ప్రభుత్వ నిధులు, భక్తుల సహకారంతో మొత్తం రూ 1.30 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించటం అభినందనీయమన్నారు. ఈ మేరకు కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధాన దాత పొన్నపల్లి సోమయాజులు, చావలి శ్రీధర్ శర్మ, మల్లెల కృష్ణమూర్తి, అన్నదానం సత్యనారాయణ, పొన్నపల్లి శివరామకృష్ణ, ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మ, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, స్థానిక సర్పంచ్ పైనం బసవపున్నమ్మ, నాయకులు పైనం ఏడుకొండల రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, బందారు రామారావు, మరివాడ ప్రసాద్, తూము కోటేశ్వరరావు, తురిమెళ్ళ శ్రీధర్, అఖిల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

12వ అదనపు జిల్లా, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా చక్రపాణి

నగరంపాలెం: 12వ అదనపు జిల్లా, కుటుంబ వివాదాల న్యాయస్థానం న్యాయమూర్తిగా జి.చక్రపాణి బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జిల్లా కోర్టు అవరణలో న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. జ్యుడీషియల్ అకాడమీ (మంగళగిరి)లో జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ఆయన గుంటూరుకు బదిలీయ్యారు.

శివకుమార్ ఆస్తుల్లో మార్పులేదు

తెనాలిరూరల్: వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేసిన అన్నాబత్తుని శివకుమార్ 2019 నుండి 2024 వరకు తన ఆస్తుల్లో పెరుగుదల లేదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అప్పులు పెరిగినట్టు చూపారు. శివకుమార్‌కు రూ. 60 లక్షల చరాస్తులు, ఆయన సతీమణి పుష్పకు రూ. 6.13 కోట్ల చరాస్తులు. హిందూ అవిభక్త కుటుంబం కింద రూ. 22 లక్షలు, మొత్తం రూ. 6.95 కోట్ల చరాస్తులు ఉన్నట్టు చూపారు. ఇక స్థిరాస్తుల్లో హిందూ అవిభక్త కుటుంబం కింద శివకుమార్‌కు రూ. 33.75 కోట్లు, అన్నాబత్తుని పుష్పకు రూ. 98 లక్షలు మొత్తం రూ. 33.72 కోట్ల విలువగా చూపారు. అలానే హిందూ అవిభక్త కుటుంబం కింద శివకుమార్ పేరిట రూ. 56 లక్షల రుణం ఉండగా, ఆయన సతీమణి పుష్ప పేరిట రూ. 11.92 కోట్ల రుణం ఉంది. ఇందులో తమ పూర్వికుల నుండి సంక్రమించిన స్థలంలో ఇంటి నిర్మాణం కోసం రూ. 6.40 కోట్ల రుణం తీసుకున్నట్టు అఫిడవిట్‌లో పొందుపరిచారు.

తెనాలిలో మనోహర్ నామినేషన్



తెనాలిరూరల్: నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా నాదెండ్ల మనోహర్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, బీజేపీ నేతలు, జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో ఐతాన గర్లింగారావు సెంటరు నుండి భారీ ర్యాలీగా గాంధీ చౌక్, శివాజీచౌక్‌ల మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. తన భార్య మనోహరం, ఆలపాటి రాజా తదితరులతో కలసి రిటర్నింగ్ అధికారి ప్రఖర్ జైన్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు.

మనోహర్ ఆస్తి పెరిగింది!

తెనాలిరూరల్: జనసేన పార్టీ తరఫున తెనాలి అభ్యర్థిగా నామినేషన్ వేసిన నాదెండ్ల మనోహర్ తన ఆస్తి రూ 22.89 కోట్లుగా ప్రకటించారు. 2019 కన్నా రూ. 12 కోట్లు పెరిగినట్టు అఫిడవిట్‌లో పేర్కొ న్నారు. తనపేరిట రూ. 1,48,03,300 విలువ చేసే చరాస్తులు ఉండగా తన భార్య పేర రూ. 2,49,33,338, కుమారుడి పేర రూ. 3,63,966 చరాస్తులు ఉన్న ట్టు చూపారు. తన పేర రూ, 1.95 కోట్ల విలువ చేసే 6.32 ఎకరాల వ్యవసాయ భూమి, తన భార్య పేరిట ద్వారకా తిరుమల, కర్ణాటకలలో రూ. 8.75 కోట్ల విలువ చేసే 8.54 ఎకరాల వ్యవసాయ భూమి, శేరిలింగంపల్లిలో రూ. 2,99,15,000 విలువ చేసే ఫ్లాట్, జూబ్లీ హిల్స్‌లో రూ. 4,59,40. 000 విలువ చేసే ప్లాట్ ఉన్నట్టు చూపారు. తన పేరిట రూ. 43,96,641 వాహన రుణం ఉండగా తన భార్యకు రూ. నాలుగు కోట్లు రుణం ఉందని చూపారు. ఇక తనపై ఎటువంటి కేసులు లేవని స్పష్టం చేశారు. కాగా 2019లో తన ఆస్తి రూ. 10,68,78,117గా మనోహర్ చూపారు.

చిన్నగా పొమ్మని చెప్పిన వ్యక్తిపై పచ్చదండు దాడి

ఈపూరు : అధిక వేగంతో వస్తున్న వాహనాన్ని పిల్లలకు తగుతుంది.. పక్కకు పోండి అన్న మాటకు ఓ వ్యక్తిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మండలంలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. వినుకొండలో జీవీ ఆంజనేయులు వేసే నామినేషన్‌కు బొల్లాపల్లి మండలం లాలిపురం నుంచి నాలుగు చక్రాల వాహనాల్లో అధిక స్పీడ్‌తో వస్తున్నారు. ఈ క్రమంలో బొమ్మరాజుపల్లి గ్రామంవద్దకు వచ్చేసరికి చిన్నారులు రోడ్డుపక్కన ఆడుకుంటుండటంతో వారికి తగులుతుందని గ్రామానికి చెందిన మారగాని కోటేశ్వరరావు చిన్నగా పోండని చెప్పడంతో వాహనంలో ఉన్నవారు ఒక్కసారిగా నలుగురు దిగి కోటేశ్వరరావుపై పిడిగుద్దులు గుద్ది కొట్టి తీవ్రంగా గాయపరిచి చొక్కా చించివేశారు. ఈలోపు గ్రామస్తులు రావడంతో వారు ఉడాయించే ప్రయత్నం చేశారు. గ్రామస్తులు వారిని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ వివరాలు తెలుసుకుని దాడి చేసిన వారిపై కేసు నమోదు చేశారు.

30 వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు

- మే 24 నుంచి జరగనున్న పరీక్షలు
- రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్‌కు ఇదే గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: మే 24 నుంచి జరగనున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశమున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. గుంటూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో తప్పిన విద్యార్థులతో విధిగా సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేయించాలని ఆదేశించారు. మూడు సబ్జెక్టుల వరకు రూ.110, మూడు సబ్జెక్టులకు మించితే రూ.125 చొప్పున చెల్లించాలని సూచించారు. అదేవిధంగా రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్ కోసం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. ప్రతి సబ్జెక్టుకు రీ-కౌంటింగ్ కోసం రూ.500, రీ-వెరిఫికేషన్ కోసం రూ.వెయ్యి చొప్పున రుసుము ఈనెల 30 లోపు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని తెలిపారు. పరీక్ష ఫీజుతో పాటు రీ-కౌంటింగ్, రీ-వెరిఫికేషన్ దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే పంపాలని, ఫీజులను సైతం ఆన్‌లైన్‌లోనే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వేస్ట్ ఫుడ్స్

- జంక్‌ఫుడ్స్‌తో పొంచిఉన్న జబ్బులు
- చిన్నారుల్లో జీర్ణకోశ సమస్యలు ఊబకాయం
- దూరంగా ఉండాలంటున్న వైద్యులు



గుంటూరు మెడికల్: గుంటూరు అరండల్‌పేటకు చెందిన ఇంటర్ విద్యార్థి శ్రీనివాస్ (పేరుమార్చాం) కళాశాల క్యాంటీన్‌లో ఫాస్ట్ ఫుడ్స్‌కు అలవాటుపడ్డాడు. దీంతో ఇంటి భోజనం అంటే విముఖత చూపాడు. ఇటీవల రక్త విరోచనాలతో బాధపడ్డాడు. చికిత్స కోసం గుంటూరు సర్వజనాసుపత్రికి వచ్చి గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులను సంప్రదించాడు. ఫాస్ట్‌ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం కారణమంటూ చికిత్స చేసి పంపించారు. పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన పదో తరగతి విద్యార్థిని శ్రీరమ్య (పేరుమార్చాం) పరీక్షల సమయంలో తీవ్రమైన కడుపునొప్పి సమస్యతో ఇదే విభాగ వైద్యులను సంప్రదించింది. విద్యార్థినికి వైద్య పరీక్షలనంతరం కౌన్సెలింగ్ చేశారు. పరీక్షల ఒత్తిడి, పౌష్టికాహారం సక్రమంగా తీసుకోకపోవడం, మైదా, వెన్నతో కూడిన పదార్థాలకు ప్రాధాన్యమిచ్చింది. కడుపునొప్పిని తాళలేక ఇదివరకే మూడు సార్లు ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చినట్లు తేలింది. విద్యార్థినికి, ఆమె తల్లిదండ్రులకు గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు కౌన్సెలింగ్ చేసి పలు సూచనలు అందించారు. ఇలా ఎంతో మంది విద్యార్థులు, చిన్నారులు జంక్ ఫుడ్స్ కు అలవాటు పడి రోగాలను కొని తెచ్చుకుంటున్నారు. సకాలంలో వ్యాధులను గుర్తించి చికిత్స అందించని పక్షంలో అనారోగ్యానికి గురవుతున్నారు.

రంగుల ప్యాకెట్లతో తియ్యటి విషం...

ఒకప్పుడు వేరుశనగ ఉండలు, జీడీలు, జామ, రేగిపళ్లు, ఇంట్లో తయారు చేసిన పిండివంటలే పిల్లల చిరుతిళ్లు. ఆయా కాలాల్లో పండ్లను తినేవారు. పాఠశాలల ఆవరణలో తినుబండారాలు అమ్మే దుకాణాల్లో సైతం వీటినే విక్రయించేవాళ్లు. నేడా పరిస్థితి మారిపోయింది. ఎక్కడ చూసినా రంగు రంగుల ప్యాకెట్లలో నెలల తరబడి నిల్వచేసే చిరుతిళ్లే దర్శనమిస్తున్నాయి. ఇలా రోజుల తరబడి ప్యాకెట్లలో సీల్ చేసే ఆహార పదార్థాలు ఆరోగ్యానికి హానికరం. ఈ విషయం తెలియక చిన్నారులు వాటినే ఆరగిస్తూ అనారోగ్యం బారిన పడుతున్నారు. రంగులతో కూడిన పదార్థాలు రక్తకణాలపై దాడిచేసే ప్రమాదముంది. కాబట్టి వీటినుంచి పిల్లలను దూరం చేయకపోతే చిన్నారుల ఆరోగ్యం ప్రమాదం పడొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అనధికార దుకాణాలే...

జిల్లాలో చిరుతిళ్ళ విక్రయ దుకాణాలు వెయ్యికి పైగా ఉన్నాయి. తయారీ దుకాణాలు 100 వరకు ఉన్నాయి. కేవలం ఒక్క గుంటూరు నగరంలోనే 40 హోల్‌సేల్ షాపులు ఉండగా రిటైల్‌షాపులు 100 వరకు ఉన్నాయి. వీటిల్లో ఆహార భద్రత నియంత్రణ అధికారుల నుంచి అనుమతులు పొంది నడిపే దుకాణాలు 100 కు మించి లేవు. కొందరు వ్యాపారులైతే అధిక లాభాల వేటలో నాసిరకం బియ్యం, గోధుమ, మైదా, శనగపిండి, పామాయిల్‌తో ఇళ్లలోనే చిరుతిళ్లు తయారు చేస్తూ నిబంధనలకు తిలోదకాలిస్తున్నారు.

నోటికి రుచి..ఒంటికి శని

పిజ్జా..బర్గర్లు..నూడుల్స్..పఫ్స్..కేకులు.. ప్రస్తుతం ఈ పదార్థాల హవా కొనసాగుతోంది. కార్పొరేట్ స్థాయిని తలపించే తరహాలో దుకాణాలు వెలసి ఆకర్షిస్తున్నాయి. కానీ ఈ పదార్థాలు కేవలం మైదాతోనే తయారు చేస్తారు. వీటిని ఆరగించడం వల్ల పిల్లల శరీరాల్లో చెడు కొలెస్ట్రాల్ పెరుగుతుంది. ఊబకాయానికి దారితీస్తుంది. శరీరంలో జీవక్రియ వ్యవస్థ మందగిస్తోంది. మెదడు వ్యవస్థ దెబ్బతింటుంది. మరోవైపు అటు పాఠశాలల్లో, ఇటు ఇళ్ల వద్ద వ్యాయామం లేకపోవడం ఆరోగ్యం మరింత దెబ్బతింటోంది. మార్కులు, ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి..ఇలా ఒక్కోటి తోడై పిల్లల జీర్ణకోశ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయి. ఐదేళ్ల నుంచి 17ఏళ్ల మధ్య వారు ఎక్కువగా వీటి బారిన పడుతున్నారు.



> ### చిరుప్రాయంలోనే మధుమేహం, రక్తపోటు
>
> 
>
> చిరుతిళ్లలో వంట నూనెలది ప్రధాన పాత్ర. చాలావరకు వాడిన నూనెనే తిరిగి ఉపయోగిస్తూ పదార్థాలను తయారు చేస్తుంటారు. ఇలాంటి నూనెతో తయారు చేసిన పదార్థాలను ఒక్కసారి తింటే వారానికి సరిపడా ఉప్పు శరీరంలోకి వెళ్తుంది. ఫలితంగా చిరుప్రాయంలోనే బీపీ, సుగర్, రక్తహీనత తదితర సమస్యలు తలెత్తుతాయి. వీలైనంతమేర వీటికి దూరంగా ఉంచడం శ్రేయస్కరం.
>
> – డాక్టర్ షేక్ నాగూర్‌బాషా, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్.

బాధితుల వివరాలు

చిరుతిళ్లతో పలు రకాల సమస్యలనెదుర్కొంటూ జీజీహెచ్ ను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. 2021లో 480 మంది, 2022లో 744 మంది, 2023లో 900 మంది గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాన్ని ఆశ్రయించారు. కాగా ఈ ఏడాదిలో మార్చినెలాఖరువరకు 189 మంది వచ్చారు. బాధితులంతా 5 నుంచి 17 ఏళ్ల మధ్య వయస్కులే కావడం గమనార్హం. పై గణాంకాలను పరిశీలిస్తే ఏటికేడు రోగుల సంఖ్య పెరగడం చూస్తే చిరుతిళ్ల వినియోగం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.